కంచు 'కోట' కూలింది!

ఐదు సార్లు విజేత.. పదిసార్లు ఫైనలిస్టులు.. ఆడిన 16 సీజన్లలో ఏకంగా 12 సార్లు ప్లేఆఫ్స్.. ఐపీఎల్‌లో తన పేరే ఓ బ్రాండ్‌గా మార్చుకున్న చెన్నై సూపర్ కింగ్స్ ఘనతకు మచ్చుతునకలివి! కానీ ఇదంతా గతం.. గత రెండు సీజన్లుగా ఆ జట్టు ఆటతీరు నానాటికీ తీసికట్టుగా మారుతున్నది. ఐపీఎల్-18లో అయితే ధోనీసేన మిగిలిన జట్ల కంటే ముందుగానే నిష్క్రమించి ఆ జట్టు అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. ఐపీఎల్ ఆరంభమైనప్పట్నుంచి బ్యాక్ టు బ్యాక్ సీజన్ల (నిరుడు 5వ స్థానం)లో చెన్నై ప్లేఆఫ్స్ చేరకపోవడం ఇదే తొలిసారి. మరి లీగ్‌లోనే అత్యంత విజయవంతమైన జట్టు అయిన చెన్నై అంచనాలు ఎక్కడ తప్పాయి?

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

వరుస పరాభవాలతో సతమతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)కు ఈ సీజన్ తీవ్ర నిరాశను మిగిల్చింది. బుధవారం చెన్నైలోని చెపాక్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఓడటంతో ప్లేఆఫ్స్ రేసు నుంచి ఆ జట్టు అధికారికంగా నిష్క్రమించింది. ఒకప్పుడు కంచుకోట అయిన చెపాక్‌లో పంజాబ్‌తో ఓటమి ఆ జట్టుకు ఈ సీజన్‌లో సొంతగడ్డపై వరుసగా ఐదో ఓటమి. ఐపీఎల్-18లో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. ఇలా అన్ని విభాగాల్లో విఫలమైన సీఎస్‌కే.. చెపాక్‌లో ఘోర అవమానాలను మూటగట్టుకోవాల్సి వచ్చింది. 43 ఏండ్ల వయసులోనూ ధోనీపై ఎక్కువగా ఆధారపడటం.. ఈ ఫార్మాట్‌కు సరిపడకున్నా సీనియర్లనే నమ్ముకోవడం.. బ్యాటింగ్ బలహీనత.. పేలవ ఫీల్డింగ్.. ఆక్షన్ తప్పిదాలు.. కీలక ఆటగాళ్ల గాయాలు.. వెరసి ఈ సీజన్‌లో చెన్నైకి ఏదీ కలిసి రాలేదు.

బ్యాట్‌తో అట్టర్‌ప్లాఫ్

తాజా సీజన్‌లో చెన్నై వైఫల్యాలకు ప్రధాన కారణం బ్యాటింగ్ వైఫల్యమే అనేది సుస్పష్టం. ఆరంభం నుంచీ ఆ జట్టుకు సరైన ఓపెనింగ్ జోడీ కుదరనేలేదు. ఆరంభ మ్యాచ్‌లలో రచిన్, రుతురాజ్, కాన్వే, త్రిపాఠి.. ఇలా పలువురిని ప్రయోగించి విఫలమైన ఆ జట్టు.. గత నాలుగు మ్యాచ్‌ల్లో షేక్ రషీద్, అయుశ్ మాత్రెతో ప్రయోగం చేసినా ఫలితం మారలేదు. గత కొన్ని సీజన్లుగా ఆ జట్టు అత్యధిక పరుగుల వీరుడైన రుతురాజ్.. ఈసారి సారథిగా పలు మ్యాచ్‌లలో రాణించినా గాయంతో అతడు వెనుదిరగడం చెన్నైకి కోలుకోలేని దెబ్బ. మిగిలిన జట్లన్నీ పవర్‌ప్లేలోనే వీరబాదుడు బాది ప్రత్యర్థులపై ఆధిపత్యం చెలాయిస్తుంటే.. చెన్నై ఈ సీజన్‌లో ఆడిన పది మ్యాచ్‌లకు గాను ఆరుసార్లు కనీసం 50 రన్స్ కూడా చేయలేక చతికిలపడింది. 18వ సీజన్‌లో ఇప్పటిదాకా ఆ జట్టుదే అత్యల్ప రన్‌రేట్ (8.23). న్యూజిలాండ్ తరపున సంచలన ప్రదర్శనలతో దుమ్మురేపే రచిన్‌తో పాటు కాన్వే ఈ సీజన్‌లో దారుణంగా విఫలమవడంతో సీఎస్‌కే యాజమాన్యం వారిని బెంచ్‌కే పరిమితం చేసింది. త్రిపాఠి ఆరు మ్యాచ్‌లు ఆడితే చేసినవి 55 పరుగులు. మిడిలార్డర్‌లో జడేజా (165)తో పాటు మ్యాచ్‌కు ఓ స్థానంలో బ్యాటింగ్‌కు వస్తున్న ధోనీ కూడా ఆశించిన స్థాయిలో రాణించలేదు. దీపక్ హుడా, విజయ్ శంకర్ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. సీఎస్‌కే భారీ ఆశలు పెట్టుకున్న శివమ్ దూబె కూడా పది ఇన్నింగ్స్‌ల్లో చేసింది 248 పరుగులే. స్పిన్నర్లను బాగా ఆడగలడనే పేరున్న అతడు తాజా సీజన్‌లో మాత్రం మెరుపులు మెరిపించలేకపోతున్నాడు. ఇప్పటి దాకా పది మ్యాచ్‌లు ఆడిన చెన్నై.. 200 మార్కు దాటింది ఒకే ఒక్కసారి. ప్రత్యర్థులు తమ ఎదుట 180+ టార్గెట్ నిర్దేశిస్తే చెన్నై ఓటమి అధికారికంగా ఖరారే అన్నంత ఘోరంగా ఆ జట్టు బ్యాటింగ్ ప్రదర్శన కొనసాగుతున్నది. చెన్నై ఫీల్డింగ్ గురించి మాట్లాడుకోకపోవడమే ఉత్తమం. ఈ సీజన్‌లో సీఎస్‌కే ఫీల్డర్లు వదిలేసిన క్యాచ్‌లు 20కు పైనే.. స్వయంగా ధోనీనే 'మా ఫీల్డింగ్ మారాలి. మేం కొన్ని క్యాచ్‌లను మిస్ చేయకుంటే బాగుండేది' అన్నాడంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిఖార్సైన పేస్ ఆల్‌రౌండర్ లేకపోవడమూ చెన్నైని దెబ్బతీసింది.

ధోనీ.. ఇంకెన్నాళ్లు?

సీఎస్‌కే అంటే ధోనీ.. ధోనీ అంటే సీఎస్‌కే అన్నంతగా అభిమానాన్ని సంపాదించుకున్న 'తలా'పై చెన్నై బాగా ఆధారపడటమూ ఆ జట్టు వైఫల్యాలకు ఓ కారణమని చెప్పకతప్పదు. 43 ఏండ్ల వయసులో ధోనీ బ్యాటింగ్‌లో నాటి దూకుడు లేదు. అడపాదడపా షాట్లు ఆడుతున్నా అవీ జట్టుకు విజయాలు అందించేవైతే కావు. సీజన్ మధ్యలో రుతురాజ్ గాయపడగానే మరో ప్లేయర్ కోసం చూడకుండా సీఎస్‌కే యాజమాన్యం.. ధోనీకే ఆ బాధ్యతలను అప్పగించడం చూస్తే ఇన్నేండ్లలో ఆ జట్టు ధోనీ వారసుడిని తయారు చేసుకోలేకపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆక్షన్‌లోనే తప్పులు

అశ్విన్, జడేజా భారత క్రికెట్ దిగ్గజాలనడంలో సందేహమే లేదు. కానీ ఈ ఇద్దరూ జాతీయ టీ20 జట్టుకు వీడ్కోలు పలికారు. వయసు రీత్యా కుర్రాళ్లలో ఉండే దూకుడు ఈ ఇద్దరిలో లేదన్నది కండ్లెదుట కనబడుతున్న వాస్తవం. 'డాడీస్ ఆర్మీ'గా ముద్రపడ్డ చెన్నై.. వేలంలోనూ ఇలాంటి వయసు మళ్లిన ఆటగాళ్లను తీసుకుని పప్పులో కాలేసింది. జడ్డూను రూ. 18 కోట్లకు రిటైన్ చేసుకున్న చెన్నై.. వేలంలో అశ్విన్‌ను రూ. 9.75 కోట్లకు దక్కించుకుంది. కాన్వేకు రూ. 6.25 కోట్లు వెచ్చించిన ఆ జట్టు.. శ్రేయాస్ అయ్యర్, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ వంటి యువ ఆటగాళ్లు వేలంలో ఉన్నా వారివంక కన్నెత్తి కూడా చూడలేదు. స్వయంగా చెన్నై హెడ్‌కోచ్ ఫ్లెమింగ్ ఓ సందర్భంలో మాట్లాడుతూ.. 'వేలంలో మేం ఇతర జట్లతో పోలిస్తే కొన్ని విషయాల్లో విఫలమయ్యాం' అని చెప్పాడు.

ఆధిపత్యానికి తెర

స్పిన్‌కు అనుకూలించే చెపాక్‌లో ప్రత్యర్థులపై చెన్నై ఆధిపత్యం మరో స్థాయిలో ఉండేది. ఇక్కడ ధోనీసేనను ఓడించాలంటే పర్యాటక జట్లకు శక్తికి మించిన పనే అయ్యేది. ఈ సీజన్‌కు ముందు చెపాక్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 2008 నుంచి ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. 15 ఏండ్లుగా ఢిల్లీకి పరాభవాలు తప్పలేదు. హైదరాబాద్ అయితే అసలు ఇక్కడ గెలుపు రుచినే చూడలేదు. కానీ ఈ సీజన్‌లో ఈ మూడు జట్లు చరిత్రను తిరగరాశాయి. అదీగాక చెపాక్‌లో వరుసగా ఐదు మ్యాచ్‌లు ఓడటం సీఎస్‌కే చరిత్రలో ఇదే మొదటిసారి. ఏదేమైనా చెన్నైకి ఈ సీజన్ ఓ మేలుకొలుపు. సీనియర్లను, సంప్రదాయ పాత పద్ధతులను వదిలేసి కొత్త నాయకత్వం, యువ క్రికెటర్ల వైపు దృష్టి సారించడానికి ఆ జట్టుకు సువర్ణావకాశం. వచ్చే సీజన్ నాటికి చెన్నై ఎలా కమ్‌బ్యాక్ ఇస్తుందనేది ఆసక్తికరం!

భారత్‌లో నదీమ్ ఇన్‌స్టా ఖాతా బ్లాక్

ఢిల్లీ: పాకిస్థాన్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా భారత్‌లో బ్లాక్ అయింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌కు చెందిన టీవీ, వెబ్‌సైట్లు, యూట్యూబర్ల వ్యక్తిగత చానెల్స్‌పై నిషేధం విధిస్తున్న భారత్.. తాజాగా నదీమ్ ఖాతాను బ్లాక్ చేసింది. గురువారం నుంచి నదీమ్ ఇన్‌స్టా ఖాతాను ఓపెన్ చేసిన యూజర్లకు 'అకౌంట్ నాట్ అవైలేబుల్ ఇన్ ఇండియా' అని చూపించింది.

లార్డ్స్‌లో టీ20 వరల్డ్‌కప్ ఫైనల్

దుబాయ్: వచ్చే ఏడాది ఇంగ్లండ్‌లో జరగాల్సి ఉన్న మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు ప్రఖ్యాత లార్డ్స్ మైదానం ఆతిథ్యమివ్వనున్నది. ఈ మేరకు ఐసీసీ గురువారం టీ20 ప్రపంచకప్-2026 షెడ్యూల్‌తో పాటు మ్యాచ్‌లు జరిగే వేదికలనూ ప్రకటించింది. జూన్ 12న మొదలయ్యే ప్రపంచకప్.. జూలై 5న లార్డ్స్‌లో జరుగబోయే ఫైనల్‌తో ముగుస్తుంది.

భారత్‌కు ఓదార్పు విజయం

గ్జియామెన్ (చైనా): ప్రతిష్టాత్మక సుదిర్మన్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించిన భారత జట్టుకు ఓదార్పు విజయం. గురువారం గ్రూప్ దశలో భాగంగా జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్.. 3-2తో ఇంగ్లండ్‌ను ఓడించింది. మహిళల సింగిల్స్‌లో అనుపమ 21-12, 21-16తో మియు లిన్‌ను ఓడించి ఆరంభంలోనే ఆధిక్యం అందించింది. కరుణాకరన్ 18-21, 22-20, 21-13తో హ్యోరీను చిత్తు చేశాడు.

ముంబై సిక్సర్

రాణించిన రికల్టన్, రోహిత్ • రాజస్థాన్ రాయల్స్ ఔట్

జైపూర్: ఐపీఎల్-18లో వరుస విజయాలతో అదరగొడుతున్న ముంబై ఇండియన్స్ మరోసారి సత్తాచాటింది. గురువారం జైపూర్‌లోని సవాయ్‌మాన్‌సింగ్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను 117 పరుగుల తేడాతో ఓడించింది. పూర్తి ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో మొదట బ్యాట్‌తో ఆ తర్వాత బంతితోనూ రాణించిన ముంబైకి ఈ సీజన్‌లో ఇది వరుసగా ఆరో విజయం. ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే తప్పక గెలవాల్సిన పోరులో రాజస్థాన్ సమిష్టిగా విఫలమై ఆడిన 11 మ్యాచ్‌లకు గాను ఎనిమిదింటిలో ఓడి ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై.. రికెల్టన్ (38 బంతుల్లో 61, 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (36 బంతుల్లో 53, 9 ఫోర్లు), సూర్యకుమార్ యాదవ్ (23 బంతుల్లో 48 నాటౌట్, 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), హార్దిక్ పాండ్యా (23 బంతుల్లో 48 నాటౌట్, 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 217/2 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో రాజస్థాన్ 16.1 ఓవర్లలో 117 పరుగులకే కుప్పకూలింది. ముంబై బౌలర్లలో కర్ణ్ శర్మ(3/23), బౌల్ట్(3/28), బుమ్రా (2/15) రాయల్స్‌ను కుప్పకూల్చారు. లీగ్‌లో 8వ ఓటమితో రాజస్థాన్ అధికారికంగా ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించగా, ముంబై టాప్‌లోకి దూసుకొచ్చింది.

క్యూ కట్టారు

ఛేదనలో రాజస్థాన్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ నుంచే ఆటుపోట్లకు గురైంది. ముంబై పేసర్ల జోరుతో రాయల్స్ బ్యాటింగ్ లైనప్ కుదేలైంది. టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్‌లో ఒక్కరంటే ఒక్క బ్యాటర్ కూడా కనీసం 15 బంతులను ఎదుర్కోకుండానే పెవిలియన్‌కు క్యూ కట్టారు. గత మ్యాచ్‌లో సెంచరీతో ఆకట్టుకున్న వైభవ్ సూర్యవంశీ.. దీపక్ చాహర్ తొలి ఓవర్ నాలుగో బంతికి విల్ జాక్స్‌కు క్యాచ్ ఇవ్వడంతో రాయల్స్ వికెట్ల పతనం మొదలైంది. బౌల్ట్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు కొట్టిన జైస్వాల్ (13).. నాలుగో బంతికి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. బౌల్ట్ తన తర్వాతి ఓవర్లో నితీశ్ రాణా (9)నూ పెవిలియన్‌కు పంపాడు. బుమ్రా తాను వేసిన తొలి ఓవర్లోనే పరాగ్ (16), హెట్‌మెయర్‌ను ఔట్ చేసి రాయల్స్‌ను కోలుకోలేని దెబ్బకొట్టాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన శుభమ్ (15)ను హార్దిక్ ఔట్ చేశాడు. జురెల్ (11) కూడా వారినే అనుసరించాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన కర్ణ్‌శర్మ..జురెల్‌తో పాటు తీక్షణ(2), కార్తికేయ(2)ను ఔట్ చేసి ముంబై గెలుపులో కీలకమయ్యాడు.

'టాప్' లేపారు

ముంబై ఇన్నింగ్స్‌లో టాప్-4 బ్యాటర్లు దుమ్మురేపడంతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది. 11 ఓవర్ల పాటు ఓపెనర్లు రికెల్టన్, రోహిత్ దంచితే.. ఆ తర్వాత సూర్య, హార్దిక్ వంతు. తొలి మూడు ఓవర్లలో ముంబై 18 పరుగులే చేసినా తర్వాత గేర్ మార్చింది. ఫరూఖీ బౌలింగ్‌లో 6, 4 బాదిన రికెల్టన్.. ఆర్చర్ ఓవర్‌లోనూ 4, 6 దంచి ముంబై ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. తీక్షణ బౌలింగ్‌లో రోహిత్ రెండు బౌండరీలు కొట్టాడు. కార్తికేయ ఓవర్లో సిక్సర్‌తో రికెల్టన్ అర్ధ శతకం పూర్తయింది. తీక్షణ 12వ ఓవర్లో బంతిని బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా బౌండరీకి తరలించిన హిట్‌మ్యాన్.. ఈ సీజన్‌లో మూడో హాఫ్ సెంచరీని నమోదుచేశాడు. ఐదు బంతుల వ్యవధిలో ఈ ఇద్దరూ నిష్క్రమించడంతో 116 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కానీ వీరి స్థానాల్లో వచ్చిన సూర్య, హార్దిక్.. రాయల్స్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఎదుర్కున్న తొలి బంతినే బౌండరీ బాదిన సూర్య.. ఫరూఖీ ఓవర్లో రెండు ఫోర్లు రాబట్టాడు. అతడే వేసిన 18వ ఓవర్లో హార్దిక్.. 4, 6, 4, 4తో 21 పరుగులొచ్చాయి. హార్దిక్-సూర్య అజేయమైన మూడో వికెట్‌కు 94 రన్స్ జోడించారు. చివరి ఐదు ఓవర్లలో ఈ ద్వయం 71 పరుగులు పిండుకుంది.

సంక్షిప్త స్కోర్లు

ముంబై: 20 ఓవర్లలో 217/2 (రికెల్టన్ 61, రోహిత్ 53, పరాగ్ 1/12, తీక్షణ 1/47); **రాజస్థాన్:**16.1 ఓవర్లలో 117 ఆలౌట్(ఆర్చర్ 30, పరాగ్ 16, కర్ణ్‌శర్మ 3/23, బౌల్ట్ 3/28)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
ముంబై	11	7	4	0	14	1.27
బెంగళూరు	10	7	3	0	14	0.52
పంజాబ్	10	6	3	1	13	0.19
గుజరాత్	9	6	3	0	12	0.74
ఢిల్లీ	10	6	4	0	12	0.36
లక్నో	10	5	5	0	10	-0.03
కోల్‌కతా	10	4	5	1	9	0.27
రాజస్థాన్ X	11	3	8	0	6	-0.78
హైదరాబాద్	9	3	6	0	6	-1.10
చెన్నై X	10	2	8	0	4	-1.21

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

భారత్‌కు నాలుగు స్వర్ణాలు

అమ్మాన్(జోర్డాన్): ఏషియన్ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత పతక జోరు దిగ్విజయంగా కొనసాగింది. పోటీలకు ఆఖరి రోజైన గురువారం జరిగిన వేర్వేరు బౌట్లలో భారత బాక్సర్లు నాలుగు స్వర్ణాలు కైవసం చేసుకుని ఓవరాల్‌గా రెండో స్థానంలో నిలిచారు. టోర్నీలో భారత్‌కు 15 స్వర్ణాలు సహా 6 రజతాలు, 22 కాంస్య పతకాలు దక్కాయి. కజకిస్థాన్ అగ్రస్థానంలో నిలువగా, ఉజ్బెకిస్థాన్‌కు మూడో స్థానం లభించింది. బాలికల అండర్-17 విభాగంలో కుశి చాంద్(46కి), అహానశర్మ(50కి), జన్నత్(54కి), అన్మిక(80+కి) ప్రత్యర్థులపై విజయాలతో పసిడి పతకాలు ఖాతాలో వేసుకున్నారు. భారత యువ బాక్సర్లు ఇలాంటి ప్రదర్శనే కొనసాగిస్తే భవిష్యత్‌లో ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సొంతమవుతాయని బాక్సింగ్ కమిటీ తాత్కాలిక చైర్మన్ అజయ్ సింగ్ పేర్కొన్నారు.

న్యూఢిల్లీలో గురువారం కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు అందుకుంటున్న స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి

ఆ ముగ్గురే నాకు ప్రేరణ

చిరంజీవిని ప్రేరణగా తీసుకొని నటులైన వాళ్లు టాలీవుడ్‌లో కోకొల్లలు. ఎందరినో తన నటన, డ్యాన్సుల ద్వారా ప్రభావితం చేశారు చిరంజీవి. మరి అలాంటి మెగాస్టార్‌ని కూడా ఓ ముగ్గురు ఓ రేంజ్‌లో ప్రభావితం చేశారట. నటుడిగా చిరంజీవిపై వారి ప్రభావం ఎంతో ఉందట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా చెప్పారు. ముంబయ్ వేదికగా గురువారం జరిగిన 'వేవ్స్'(World Audio Visual Entertainment Summit)లో పాల్గొన్న చిరంజీవి.. తన సినీ ప్రయాణంలో తనని ఇన్‌స్పైర్ చేసిన వారిని గుర్తు చేసుకున్నారు. 'చిన్నప్పట్నుంచే డ్యాన్సులు చేస్తూ ఇంట్లో వాళ్లని, ఫ్రెండ్స్‌ని అలరించేవాడ్ని. వారంతా మెచ్చుకుంటుంటే ఏదో తెలియని కిక్. ఆ కిక్కే నన్ను నటన వైపు నడిపించింది. దాంతో చెన్నై రైలెక్కాను. నేను చెన్నైలో అడుగుపెట్టిన టైమ్‌లో మహా మహులు ఇండస్ట్రీని ఏలుతున్నారు. 'ఇంతమంది సూపర్‌స్టార్లు ఉన్నారు కదా.. నేను కొత్తగా ఏం చేయగలను?' అని ఆలోచిస్తూ ఉండేవాడ్ని. 1977లో నటశిక్షణ పూర్తయింది. మేకప్ లేకుండా సహజంగా నటించే విషయంలో మిథున్ చక్రవర్తి.. స్టంట్స్, ఎమోషనల్ సీన్స్ చేసే విషయంలో అమితాబ్.. డ్యాన్స్ విషయంలో కమల్‌హాసన్.. ఈ ముగ్గురూ నాకు ప్రేరణగా నిలిచారు. వారి సినిమాలు చూస్తూ, నటనను పరిశీలిస్తూ నన్ను నేను మలచుకున్నా' అని చిరంజీవి చెప్పారు. రజనీకాంత్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిత్రం

తెలుగు ఇండస్ట్రీ ఊపిరి పీల్చుకుంది

'ఏప్రిల్ నెలలో సరైన సినిమాలు లేక తెలుగు రాష్ట్రాల్లో చాలా సింగిల్ స్క్రీన్స్ మూసివేయడం జరిగింది. ఇలాంటి తరుణంలో 'హిట్-3' మీద అందరూ అంచనాలు పెట్టుకున్నారు. ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ చూసి ప్రేక్షకులు థియేటర్లకు రాబోతున్నారని హ్యాపీగా ఫీలయ్యాం. ఈ సినిమాతో తెలుగు ఇండస్ట్రీ మళ్లీ ఉపిరి పీల్చుకుంది' అన్నారు అగ్ర నిర్మాత దిల్‌రాజు. నాని కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన 'హిట్-3' గురువారం విడుదలై హిట్‌టాక్ సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దిల్‌రాజు మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. నాని మాట్లాడుతూ 'సినిమా బుకింగ్స్ అదిరిపోయాయి. అంతటా సూపర్‌హిట్ టాక్ వినిపిస్తున్నది. ప్రేక్షకులు, నేనూ ఒకటేనని ఎప్పుడూ నమ్ముతాను. ఈ సినిమా విజయంతో మరోసారి నా నమ్మకం నిజమైంది. ఈరోజు రాత్రి అమెరికా వెళ్తున్నా. నాలుగు రోజుల తర్వాత తిరిగొస్తా. అప్పుడు గ్రాండ్‌గా సక్సెస్‌ను సెలబ్రేట్ చేసుకుందాం' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ప్రశాంతి తిపిర్నేని పాల్గొన్నారు.

హైదరాబాద్ జోష్ 'దేత్తడి'

అగ్ర నిర్మాత దిల్‌రాజు తెరకెక్కిస్తున్న 60వ చిత్రానికి 'దేత్తడి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఆశిష్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా ఆదిత్య రావు గంగసాని దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. గురువారం హీరో ఆశిష్ పుట్టినరోజు సందర్భంగా సినిమా టైటిల్‌ను ప్రకటించడంతో పాటు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. 'హైదరాబాద్ నేపథ్య కథాంశమిది. ఇక్కడి యువత తాలూకు జోష్, వారిదైన ప్రత్యేక కల్చర్‌ను ఆవిష్కరిస్తుంది. ఆద్యంతం చక్కటి వినోదంతో పాటు హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలుంటాయి. మాస్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో హీరో ఆశిష్ డప్పు వాద్యకారుడి గెటప్‌లో ఉత్సాహంగా కనిపిస్తున్నారు. త్వరలో సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ చిత్రానికి నిర్మాణ సంస్థ: శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, రుతమ్ స్టోరీ ల్యాబ్, నిర్మాతలు: దిల్‌రాజు, శిరీష్, దర్శకత్వం: ఆదిత్యరావు గంగసాని.

వారణాసి సన్నివేశాలకోసం..

పిల్లలకు పరీక్షలైపోగానే ఎండాకాలం సెలవులిచ్చేస్తుంది గవర్నమెంట్. అలాగే రాజమౌళి కూడా తన టీమ్‌కి సమ్మర్ హాలీడేస్ ప్రకటించేశారు. గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో 'SSMB 29' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఈ షెడ్యూల్‌లో కొన్ని కీలక సన్నివేశాలతోపాటు ప్రియాంక, మహేశ్‌లపై ఓ పాటను కూడా రాజమౌళి చిత్రీకరించారు. ఏప్రిల్ 30తో పూర్తయిన ఈ పాట చిత్రీకరణతో ఈ షెడ్యూల్ కంప్లీటయ్యింది. జూన్ 10ని నెట్స్ షెడ్యూల్ డేట్‌గా ఫిక్స్ చేశారు రాజమౌళి. ఈ 40 రోజులు మహేష్ ఫ్యామిలీ ప్రతి ఏడాది లాగే హాయిగా ఫారిన్ ట్రిప్‌కి వెళ్లిపోవచ్చు. అలాగే రాజమౌళి కూడా విహార యాత్రకు ప్లాన్ చేసుకుంటున్నారని సమాచారం. ఇదిలావుంటే.. 40 రోజుల తర్వాత మొదలయ్యే షెడ్యూల్ కోసం ఆర్ట్ డిపార్ట్‌మెంట్ వారణాసి సెట్‌ను సిద్ధం చేసే పని మొదలుపెట్టింది. ప్రస్తుతం ఈ సెట్‌కి సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. జూన్ 10 నుంచి ఈ సెట్‌లోనే కథలో కీలకమైన వారణాసి నేపథ్య సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తారట. 2026లో ఈ సినిమా విడుదలవుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే.. ఇన్‌సైడ్ టాక్ ప్రకారం 2027 దాకా ఆగాల్సిందేనని తెలుస్తున్నది. మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో నానా పటేకర్ ఓ కీలకమైన పాత్ర పోషిస్తున్నారట. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే.

గల్వాన్ ఘటన నేపథ్యంలో

భారత్-చైనా సైనికుల మధ్య లద్దాఖ్ సరిహద్దులోని గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలో 20 మంది భారత సైనికులు అమరులైన విషయం తెలిసిందే. ఈ సంఘటన ఆధారంగా బాలీవుడ్ దర్శకుడు అపూర్వ లాఖియా ఓ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో ఆర్మీ అధికారి పాత్రలో సల్మాన్ ఖాన్ నటించనున్నారని వార్తలొస్తున్నాయి. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు మొదలయ్యాయని, స్వీయ నిర్మాణంలో సల్మాన్‌ఖాన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. లద్దాఖ్‌లో షూటింగ్ జరిపేందుకు గల అవకాశాలను చిత్రబృందం పరిశీలిస్తున్నదని, ఈ స్క్రిప్ట్ సల్మాన్‌ఖాన్‌ను బాగా ఇంప్రెస్ చేయడంతో వెంటనే సెట్స్‌మీదకు తీసుకెళ్లేందుకు ఉత్సాహంగా ఉన్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

దేశభక్తి ప్రధానంగా '6జర్నీ'

రవిప్రకాష్ రెడ్డి, సమీర్‌దత్త, టేస్టీ తేజ, పల్లవి, రమ్యారెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం '6జర్నీ'. బసీర్ ఆలూరి దర్శకుడు. పాల్యం రవిప్రకాష్ రెడ్డి నిర్మాత. ఈ నెల 9న విడుదలకానుంది. దేశభక్తి ప్రధానంగా యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, సినిమాలోని సందేశం యువతను ఆకట్టుకుంటుందని దర్శకుడు పేర్కొన్నారు. కథలో మిస్టరీ ఎలిమెంట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ని పంచుతాయని, ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని నిర్మాత తెలిపారు.

ఇలాంటి రోజొస్తుందని ముందే ఊహించా

'సోషల్ మీడియాపై ప్రజల్లో పెరిగిపోతున్న వ్యామోహం చూసి ఇలాంటి రోజు ఒకటొస్తుందని నేను ముందే ఊహించా.' అన్నారు బాలీవుడ్ నటి తాప్సీ పన్ను. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ మిషా అగర్వాల్ ఆత్మహత్యకు పాల్పడిన విషయం ప్రస్తుతం బీటౌన్‌లో చర్చనీయాంశమైంది. ఆన్‌లైన్‌లో తనని అనుసరించే వారి స